# ఏడాదికో కొత్త నగరంలో ఇంటర్నెట్ సేవలు

- 2 నెలల్లో విశాఖలో సర్వీసులు ప్రారంభం
- యాక్ట్ గ్రూప్ సిఇఒ బాల మల్లాది
- ఏడాదిలో 10 లక్షలకు చేరనున్న కస్టమర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆప్టికల్ ఫైబర్ ఆధారిత ఇంటర్నెట్ సర్వీసులు అందిస్తున్న యాక్ట్ (అట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్) తన సర్వీసులను వేగంగా విస్తరించే సన్నాహాల్లో ఉంది. ఇప్పటికే హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో సర్వీసులు అందిస్తున్న ఈ సంస్థ వచ్చే రెండు నెలల్లో విశాఖపట్నంలో సర్వీసులను ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఉన్న కస్టమర్ల సంఖ్య 6.5 లక్షలకు పైనే ఉంది. వచ్చే ఏడాదికాలంలో కస్టమర్ల సంఖ్యను 10 లక్షలకు పెంచుకోవాలన్న లక్ష్యంతో ఉన్నట్లు యాక్ట్ గ్రూప్ సిఇఒ బాల మల్లాది సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏడాదికి ఒక నగరంలో తమ సర్వీసులను ప్రారంభించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు చెప్పారు. 100 కోట్ల రూపాయల పెట్టుబడి పెడితేనే



సమావేశంలో మాట్లాడుతున్న బాల మల్లాది (మధ్యలో)

ఒక నగరంలో సమగ్ర సర్వీసులు అందించడానికి అవసరం ఉంటుందని, సర్వీసుల ప్రారంభానికి ముందు తొమ్మిది నెలల పాటు అన్ని రకాల వసతులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో 4.5 లక్షలు, బెంగళూరులో 1.4 లక్షలకు పైగా కస్టమర్లున్నారని ఆయన చెప్పారు. చెన్నైలో ఇప్పుడిప్పుడే కస్టమర్ల సంఖ్య పెరుగుతోందన్నారు. సగటున నెలకు 18-20 వేల మంది కస్టమర్లను సంపాదించుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే తాము 1,000 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ 800 కోట్ల రూపాయలుగా ఉందని ఆయన తెలిపారు. ఇప్పటిదాకా టీమ్ ఫైబర్ పేరుతో హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సర్వీసులు అందించామని, దీనిని యాక్ట్ ఫైబర్ నెట్‌గా మార్చుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇంక్రెడిబుల్ 100 ఎంబీపీఎస్ పేరుతో కొత్త టారిఫ్ ప్లాన్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ ప్లాన్‌లో భాగంగా 200 జిబి డౌన్‌లోడ్ పరిమితిని ఆఫర్ చేస్తున్నారు. ఒక టెరాబైట్ పరిమితితో 250 ఎంబీపీఎస్ ప్లాన్‌ను ఎంటర్‌ప్రైజ్ కస్టమర్ల కోసం విడుదల చేశారు.

### హైదరాబాద్‌లో వైఫై హాట్‌స్పాట్

విభిన్న గ్యాడ్జెట్ల ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని పొందేందుకు ఉపయోగపడే వైఫై హాట్‌స్పాట్ సదుపాయాన్ని ఇప్పటికే హైదరాబాద్‌లోని ఒక మాల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, త్వరలోనే మరిన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని బాల మల్లాది తెలిపారు. వైఫై సర్వీసులు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కూడా చర్చిస్తామన్నారు.